# అప్పగింత

గౌరీపూజ ఘనంగా చేయిస్తున్నారు పురోహితులు. వేడుకల ఏర్పాట్లు బాగానే ఉన్నాయి. భజంత్రీలు సాంప్రదాయ స్వరాలకు కొంత ఆధునికత జోడించి వీనులవిందు చేస్తున్నారు. అంతా.... అందరిలోనూ ఒక్కటే హడావిడి. ఆడపెళ్ళి వారిలో మర్యాద పేరిట ఆతృత నెలకొని ఉంది. మగపెళ్ళివారికి దర్పం తాలూకు స్వాభిమానం, అందుకొనే మర్యాదలతో తలమునకలై కనిపిస్తున్నారు.

"పెళ్ళికొడుకు చినతాతగారికి ఉప్మా అందలేదట. వెంటనే చూడండ్రా" అక్కడ అందరిలోకి వయసులో పెద్దావిడ పెద్దగా అంటోంది.

"ఇచ్చాంలే అత్తా. మారువడ్డిస్తే తేడా చేసిందనుకో. అసలే ముసలిప్రాణి" ఉప్మా అందిస్తూన్న కుర్రాడు బదులు పలికాడు.

"టిపినీలు చేశారా? కాఫీలు త్రాగారా?" ఆడపిల్ల తాలూకు ఓ అల్లరిపిల్లాడు పెళ్ళివార్ని గుచ్చి గుచ్చి మరీ అడుగుతున్నాడు.

"తెగ సందడి చేస్తున్నావ్. పెళ్ళి సందడి సినిమా ఎన్నిసార్లు చూశావేమిటి?' మూడోమారు కాఫీ తాగుత్తు ఒకామె నిలదీసి అడుగుతోంది.

విష్ణుమూర్తికి ఆ వేడుకలేమీ పట్టడం లేదు. హడావిడులు ఆర్భాటాలు ఆయన దృష్టిని ఆకర్షించ లేకపోతున్నాయి. మనసు ధీరోదాత్తంగా ఉంది. ఒకింత దూరంగా కూర్చుని ఉన్నాడు. అక్కడ బుట్టలోని పెళ్ళికూతురు బుట్టబొమ్మలా కనిపిస్తోంది.

పట్టుబట్టలలో, నుదుట కళ్యాణ తిలకంతో విష్ణుమూర్తి కోడలు మెరిసిపోతోంది.

"కౌశిక్ నిజంగా అదృష్టవంతుడు" కల్పనను చూస్తూ తనలో తాను అనుకోకుండా ఉండలేకపోయాడు

"డాడీ ఏమిటి మీలో మీరే మాట్లాడేసుకుంటున్నారు?" పెద్ద కూతురు వనజ నవ్వుతూ పలకరిస్తోంది.

"ఏమీ లేదమ్మా! నీ మరదలు రాకతో కౌశిక్ సుఖపడతాడని"

"అవును మంచి సంబంధం" కిందపడ్డ తండ్రి కండువా తీసి ఆయన భుజం మీద వేస్తూ అంది.

"మీ ఆయన ఎక్కడ తిరుగుతున్నాడో స్నానం చేశాడా లేదా?" సమాధానం చెప్పి ముందుకు సాగిపోయింది వనజ.

విష్ణుమూర్తి మనసు మనసులో లేదు. చిత్రమైన భావోద్వేగానికి లోనవుతున్నాడు. అవడం తనది ఇప్పుడు పెళ్ళకొడుకు తండ్రిపాత్ర అయినా గతం కంటిముందు కదలాడి ఆలోచనలో పడేస్తోంది.

కన్నకూతుళ్ళకు పెళ్ళిళ్ళు చేసి అత్తవారింటికి పంపిన ఆ సన్నివేశం తన స్మృతిపథంలో మెదులుతూనే ఉంది.

మరికొన్ని నిముషాలలో ఇంటిపేరు మార్చుకొని తమ ఇంట అడుగుపెట్టే ఆ అమ్మాయి ఈ వివాహ వ్యవస్థ హైందవ జీవన విధానానికి ప్రతీక

విష్ణుమూర్తి కంటి ముందు సీతాకోకచిలుకల్లా అటూ ఇటూ తిరుగుతున్నారు తన కూతుళ్ళు అల్లుళ్ళు.

ఒకరా ఇద్దరా నలుగురు కూతుళ్ళకి తండ్రితను. ఆనాడు వంశం కోసం అంటూ భార్యతో సహా తనవాళ్ళు పోరడంతో కొడుకు పుట్టేవరకూ ఒక్కొక్కళ్ళనీ కంటూనే ఉన్నాడు.

ఇదో కాన్పులో కౌశిక్ పుట్టాడు. ఇన్నాళ్ళు తనలో జీవనోత్సాహాన్ని నింపి, చిన్నపిల్లలుగా గుండెల మీద కూర్చుని ఆడుకొని, కూతురు ప్రేమను పంచి ఇచ్చినవాళ్ళు మరో మగాడికి భార్య అయి సహచరి బాధ్యతల్ని స్వీకరించి వెళ్ళిపోయారు.

తన జ్ఞాపకాల్ని ప్రేమాభిమానాల్ని సజీవంగా వదిలి వెళ్ళిపోయిన కూతుళ్ళు, వాళ్ళ పెళ్ళి సంబరాల్లో ఆనాడు మౌనంగా రోదించాడు తాను. తనలోని సెంటిమెంట్‌ను చూసి ఎగతాళి చేసిన వాళ్ళు చాలామందే ఉన్నారు.

ఆనాటి తన హృదయవేదననే ఈనాడు శాంతినారాయణలో చూస్తున్నాడు. రాత్రి ఎదురు సన్నాహం అప్పుడు బాగానే ఉన్నాడాయన. మా వియ్యంకుడు, మా అల్లుడు అంటూ

ఖుషీగా బంధువులకు, ఆఫీసులోని వారికి పరిచయం చేశాడు.

ఇప్పుడు ఆయనలోని హృదయవేదనను కొలవడానికి ఏ పరికరం చాలదేమో. రక్తసంబంధంతో పెనవేసుకున్న తీయటి రోదన అది.

వివాహం అనేది మానవజీవితంలో ఓ అంతర్భాగమని తెలిసినా ఆడపిల్లల తాలూకువాళ్ళు ఆ సమయంలో అలా డిప్రషన్‌కి లోనుకావడం... బహుశా స్త్రీని అనామకురాలిగా చిత్రీకరిస్తూ ఒక మగాడి అధిపత్యంలోకి కన్నవారి ఇంటి పేరును సైతం మార్చిపడేసి నిరంకుశంగా పంపించేస్తున్నా మన్న విషయవేదన అయి ఉండొచ్చు.

భజంత్రీలు సుస్వరాలతో కళ్యాణశోభను తీసుకొస్తూంటే విష్ణుమూర్తి మౌనముద్రను వీడి అటువైపుకు తిరిగాడు.

టిఫిన్ తీస్కోండి. మరోసారి కాఫీ తాగండంటూ మర్యాదలతో ముంచెత్తుతున్నారు ఆడ పెళ్ళివారు. మర్యాదల పేరుతో అడుగులకు మడుగులొత్తుతూ తమను ప్రసన్నం చేసుకోవాలనుకొనే ఆడపిల్ల కలవాళ్ళ భావవేదన అది. తమకు కోపం వస్తే పిల్లను ఎక్కడ బాధలు పెడతారోనన్న ముందు జాగ్రత్త కూడా అయి ఉంటుంది.

తనూ ఆడపిల్లల తండ్రే. వాళ్ళకీ పెళ్ళిళ్ళు చేసి పురుడు పుణ్యాలు కానిచ్చి పంపిన సగటు మనిషే, ఒకనాడు తాను ఎదుర్కొన్న స్థితే అది.

గౌరీపూజ నుండి పెళ్ళి మండపంలోకి సీను షిఫ్టు అవుతోంది. విష్ణుమూర్తి అంతర్నేత్రం మట్టుకు వియ్యంకుడిలోకి పరకాయ ప్రవేశం చేసి ఉంది.

మేనమామలు బుట్టలోని పెళ్ళికూతుర్ని మోసుకొస్తూంటే పురోహితుడు కన్యాదాన కార్యక్రమానికి ఉపయుక్తమవుతున్నాడు. నూతన వధూవరుల మధ్య పల్చటి తెర. సిగ్గు పేరుతో తలవంచుకు కూర్చున్న అమ్మాయిలో ఏదో నైరాశ్య ధోరణి. తన వారిని వదిలి మరొకరి చేతిని అందుకోబోతున్నానన్న విచిత్రమైన మనోవేదన.

కల్పన ప్రక్కనే పీటలమీద కూర్చున్న శాంతి నారాయణ దంపతులకైతే సరేసరి. మహాసంకల్పం, వల్లెవేస్తూంటే అల్లుడి కాళ్ళు కడిగి నీళ్ళు నెత్తిమీద చల్లుకొని గుమ్మడిపండు, గంధం చెక్క గుమ్మడిపండులాంటి తమ ఆరోప్రాణం పరాయి మగాడి చేతుల్లోకి వెళ్ళిపోయింది.

తదుపరి శుభమూహుర్తం. జీలకర్ర బెల్లం ఒకరి నెత్తిమీద ఒకరు పెట్టుకోవడం, అందరూ అక్షింతలతో ఆశీర్వదించడం, మధుపర్క ధారణ ఒకదాని వెంట మరొకటి జరిగి పోతున్నాయి.

విష్ణుమూర్తి అంతరంగం అనిశ్చితంగానే ఉంది. భజంత్రీలు మరోసారి వాయిస్తూంటే సూత్ర ధారణ జరిగిపోయింది. అమ్మాయి మెడలో మూడుముళ్ళు వేస్తూంటే

పెళ్ళికొడుకు ఏవో జోక్స్ వేసి పకపకా నవ్వుతున్నాడు. వీడియోలో బాగా పడాలన్న వెర్రి ఆలోచన కావచ్చు.

ఇక నుండి కల్పన తన ఇంటి కోడలు. తమలో మనిషి.

“బావగారూ! మా అమ్మాయిని వువ్వుల్లో పెట్టి పెంచుకున్నాం. మీ కడుపులో వేసుకోవాలి” తాంబూలాలనాడు శాంతినారాయణ మాటలు గుర్తుకు వచ్చాయి.

తలంబ్రాలు సమయంలో కొత్త జంట పోటీ పడుతున్నారు. ఒకరికి ఒకరు ఏమాత్రం తీసి పోవడం లేదు.

“ఒదినా ఇంకా” చిన్నపిల్లలు గోల చేస్తున్నారు.

“బావా నువ్వేం తీసిపోయావని. పళ్ళెం ఎత్తి పోసేస్తే సరి” మరికొంత మంది కొంటె కోణంగిలు కౌశిక్‌ని ఎసం తోస్తున్నారు.

మొత్తానికి తలంబ్రాలు ముచ్చట బాగానే ముగిసింది. శాంతినారాయణ పెళ్ళి మండపానికి ఎడం ప్రక్క ఒక మూల నిరాశగా నిస్సత్తువగా కూలబడి ఉన్నాడు. అంబరమంత ఆవేదన అది. ఆ అంతర్నేత్రంలోని కన్నీటిని తుడవగల్గేదెవరు?

ఉద్యోగం, హోదా, పరపతి దేనిలోను లోటు లేకపోయినా ఈడొచ్చిన కూతురికి పెళ్ళిచేసి దూరం చేసుకుంటున్నానన్న సున్నితమైన ఆక్రోశం అది. మండపంలో కొత్త జంట దండలు మార్చుకుంటోంది.

నాగవల్లి, స్థాళీపాకం కూడా అయిపోతోంది. తర్వాత బంతాట. నీటిలో ఉంగరం ఆట. పురోహితుడు అంపైర్‌గా ఉండి ఆటలు ఆడిస్తున్నాడు.

ప్రతిసారీ పెళ్ళికొడుకుదే పైచేయి అవుతోంది. సందర్భోచితంగా భజంత్రీలు పాట రాగాల్ని మార్చిరక్తి కట్టిస్తున్నారు.

ఇక అప్పగింతలు. అంతసేపు ఆహ్లాదంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారి పోయింది. అందరిలోనూ బరువైన భావన. దానికి తగ్గట్టు భజంత్రీలు వాయించే అప్పగింతల పాట మరింత బరువును పెంచుతోంది.

ప్రాణప్రదమైన తన బంగారుతల్లి పసిడి చేతుల్ని పాలలో ముంచి ఒక్కొక్కరికీ అప్పగిస్తున్నాడు. భార్య సహకరిస్తోంది. అందరి కళ్ళూ జల పాతాలై వర్షిస్తున్నాయి.

పెళ్ళికొడుకు మొదలుకొని ఆ కుటుంబంలోని అందరూ బాధ్యతను స్వీకరిస్తా మన్నట్లు ఆ అమ్మాయి చేతిని అందుకున్నారు. శాంతినారాయణ అందరికీ తాంబూలం, కొత్త బట్టలు అందించాడు.

విష్ణుమూర్తికి నిర్వేదనంగా అనిపిస్తోంది. ఆ తంతు చాలా అసహజంగా ఉంది. పెళ్ళికూతురుని మాత్రమే ఎందుకు అప్పజెప్పాలి. తరతరాలుగా ఆడదాన్ని అనామకంగా చిత్రించి నువ్వు మెట్టినింటి కోడలివి. ఇక నీ బ్రతుకు అక్కడే అన్న ఈసడింపు ధోరణితో సంఘం ఆమెను అండర్ డాగ్‌గా అభివర్ణిస్తోంది. ఇది ఎంత వరకు సహేతుకం.

సూక్ష్మంగా విశ్లేషిస్తే ఆడదాని మానసిక స్థితిని దిగజార్చడం. మనోధైర్యాన్ని సడలింపజేయడం తప్ప మరోటి కాదు. శాంతినారాయణ నిర్వేదనమైన మనస్సుతో ఉండిపోయాడు. మాటలకందని మౌనఘోష అది.

పురోహితులు తర్వాత అంశానికి సన్నద్ధమవుతున్నాడు.

"ఆగండి" గట్టిగా అరిచాడు. విష్ణుమూర్తి కేక విని మోగుతున్న భజంత్రీలతో సహా అందరూ నిశ్చేష్టులైపోయారు. ఒక్కసారి అంతా నిశ్శబ్దత నెలకొంది.

"ఏమయిందండీ?" సారె అందుకునే హడావిడిలో ఉన్న విష్ణుమూర్తి భార్య పరుగెత్తుకొచ్చింది.

"డాడీకి ఏదో అయింది, కొంచెం కాఫీ పట్రండి" పెద్ద కూతురు వనజ కంగారుగా చెల్లెళ్ళకి పురమాయిస్తోంది.

"బీపీ కాని రైజ్ అయిందా?" పీటల మీంచి చటుక్కున లేచి వచ్చిన కౌశిక్ తండ్రి చేయి పట్టుకొని ఆరాతీస్తున్నాడు.

కూతురు ఇచ్చిన చల్లటి మంచినీళ్ళు తాగి ఒకింత సేదదీరాడు విష్ణుమూర్తి.

"అప్పగింతల్ని తిరిగి కొసాగించండి" మరలా అదే అరుపులాంటి స్వరం. విషయం ఎవరికీ అర్థం కాలేదు.

"లక్ష్మీ ఇటురా" భార్యను పిలిచాడు విష్ణుమూర్తి. పంతులు అప్పగింతల మంత్రం తిరిగి మొదలుపెట్టాడు. భజంత్రీలు అప్పగింతల పాటపాడుతున్నారు.

పెళ్ళి పీటపై కొడుకుని మధ్యలో కూర్చుండ బెట్టుకొని పాలలో ముంచిన కౌశిక్ చేతుల్ని మొదట పెళ్ళికూతురు, తర్వాత శాంతినారాయణ దంపతులు. ఆయన కుటుంబ సభ్యులు పేరు పేరునా అప్పగిస్తున్నాడు.

అందరికీ బట్టలు ముట్టాయి.

"పెళ్ళికొడుకుని ఆడపిల్ల తరపువారికి అప్పగించడం ఎక్కడా చూడలేదు. బాగుంది చోద్యం" ఓ ముసలావిడ ఎండిపోయిన తన చప్పి దవడల్ని నొక్కుకుంటూ అంటోంది.

కానీ విష్ణుమూర్తి ఆధునిక భావాలు, హృదయ విశాలత శాంతినారాయణతో

సహా ఎందరినో అలరిస్తున్నాయి.

"అవును బావగారూ! అటు నుండి ఇటు ఎంత దూరమో, ఇక్కడి నుండి అక్కడికీ అంతే."

"ఈ రోజుల్లో అమ్మాయి అయితే ఏమిటి? అబ్బాయి అయితే ఏమిటి? మీ కల్పనను మాకు అప్పగించడంతో బాటు, మా కౌశిక్‌ను మీ చేతుల్లో పెట్టడం అనేది ఒక బాధ్యతగా భావిస్తున్నాను. ఆలుమగలులోని హెచ్చుతగ్గుల ప్రసక్తిని నేను సమర్థించలేను. మా వాడిని కూడా మీరు కడుపులో దాచుకోవాలని కోరుతున్నాను" చేతులు పట్టుకొని ఆర్తితో అడుగుతూన్న వియ్యంకుణ్ణి చూస్తూంటే అప్పటిదాకా శాంతినారాయణ ముఖంలో దాగి ఉన్న ముసురు మేఘాలు కరిగిపోతూన్న భావన కలుగుతోంది.

ఇప్పుడు హృదయం తేలికబడి శాంతి నారాయణ హాయిగా నవ్వుతున్నాడు.

అదే విష్ణుమూర్తికి కావాల్సింది.

**(ప్రియదత్త వారపత్రికలో ప్రచురితం)**